# పదో తరగతి తెలుగు పేపర్-2 మోడల్ పేపర్

మార్కులు: 40 పార్టు ఎ,బి సమయం: 2.45 గం.

మార్కులు: 30 పార్టు ఎ సమయం: 2.15 గం.

## అవగాహన ప్రతిస్పందన

(20 మార్కులు)

*అ) కింది గద్యాన్ని చదివి, ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి.* 5 × 1 = 5

కాల చక్రం తిరుగుతున్నది. ఒకనాడు దశరథుడు తన మంత్రులు, పురోహితులు మొదలైన వారితో సమావేశమయ్యాడు. తన కుమారుల వివాహ ప్రస్తావన చేస్తున్నాడు. సరిగ్గా అదే సమయంలో అక్కడ అడుగుపెట్టాడు మహాతేజశ్శాలియైన విశ్వామిత్ర మహర్షి. సృష్టికి ప్రతిసృష్టి చేయగల సమర్థుడు. దశరథుడు ఎదురేగి సాదరంగా స్వాగతించాడు. అతిథి దేవోభవ – అతిథి మనకు దేవునితో సమానం. ఇది తెలిసిన దశరథుడు విశ్వామిత్రునికి సముచిత రీతిన మర్యాదలు గావించాడు. వినయపూర్వకంగా విశ్వామిత్రుని రాకకు కారణాన్ని అడిగాడు. తనపైన కార్యభారం పెడితే నెరవేరుస్తానన్నాడు. దశరథుని వినయానికి మురిసి పోయాడు విశ్వామిత్రుడు. వశిష్ఠుని ఉపదేశాలను పొందిన వాడివి. నీవు ఇలాగే ప్రవర్తిస్తావని మెచ్చుకున్నాడు.

ప్రశ్నలు:

1. సృష్టికి ప్రతిసృష్టి చేయగల సమర్థుడు ఎవరు?
2. దశరథుడు మంత్రులు, పురోహితులతో సమావేశమవడానికి కారణం?
3. దశరథుని వినయానికి కారణం?
4. అతిథి దేవోభవ అంటే ఏమిటి?
5. దశరథుడు ఏమి నెరవేరుస్తానన్నాడు?

*ఆ) కింది గద్యాన్ని చదివి , ఐదు ప్రశ్నలు తయారు చేయండి.* 5 × 1 = 5

ఓరుగల్లు, హన్మకొండలకు సరిగ్గా మధ్యలో ఓ కొండ మీద కొలువైన భద్రకాళి ఆలయానికి శతాబ్దాల ఘన చరిత్ర ఉంది. క్రీ.శ. 625లో ఈ ఆలయాన్ని నిర్మించినట్టు శాసనాల ద్వారా తెలుస్తుంది. ఓరుగల్లు ప్రజలకు ఇలవేల్పుగా విరాజిల్లుతున్న భద్రకాళి ఆలయం కాకతీయుల కాలం నాటికే ఎంతో ప్రాభవాన్ని సంతరించుకొందని చెబుతారు. చాళుక్య చక్రవర్తి రెండో పులకేసి భద్రకాళి మాతను దర్శించుకున్నాకే వేంగీని జయించాడని శాసనాలు చెబుతున్నాయి. కాకతీయుల కాలంలోనే ఈ ఆలయాన్ని నిర్మించారన్నది కొందరి అభిప్రాయం. ఒకప్పుడు రౌద్రరూపంగా ఉన్న భద్రకాళిదేవి తర్వాత శాంతస్వరూపిణిగా మారడం ఇక్కడ మరో ప్రత్యేకత.

ప్రశ్నలు:

6. 7. 8. 9. 10.

**ఇ) కింది పద్యాల్లో ఒకదానిని పూరించి, భావం రాయండి.**

1×5=5

11) సిరిలేకైన----సురభిమల్లా! నీతివాచస్పతీ!

(లేదా)

అనవుడు నల్ల నవ్వి ----యభీప్సితాన్నముల్

ఈ) కింది పద్యాన్ని చదివి, పట్టికను పూరించండి 5 × 1 = 5

కమలములు నీటబాసిన
కమలాప్తుని రశ్మిసోకి కమలిన భంగిన్
తమతమ నెలవులు దప్పిన
తమ మిత్రులె శత్రులగుట తథ్యము సుమతీ!

ప్రశ్నలు:

12. కమలాప్తుడు అనగా
13. ఎప్పుడు మిత్రులు శత్రువులగుతారు
14. స్థానములు/ హద్దులు అని అర్థం వచ్చే పదం
15. పై పద్యంలో మకుటం
16. బాసిన అనే పదానికి అర్థం

## వ్యక్తీకరణ - సృజనాత్మకత (సృజనాత్మకత)

*అ) కింది ప్రశ్నలలో ఏవైనా రెండింటికి జవాబులు రాయండి.*

2×5=10

17) బలి చక్రవర్తి దాన గుణాన్ని అభినందిస్తూ అభినందనా పత్రం రాయండి.
18) శతక పద్యాల గొప్పతనం తెలియచేస్తూ మిత్రునికి లేఖ రాయండి.
19) కాశీ నగరాన్ని శపించబోయిన వ్యాసమహర్షి తన తప్పు తెలుసుకొని బాధతో మాట్లాడినట్లుగా ఆత్మకథ రాయండి.

## పార్ట్-బి

**సమయం: 30 నిమిషాలు** **మార్కులు: 10**

సూచన: సరైన సమాధానాలు (ఎ/ బి/ సి/ డి) లను ఈ ప్రశ్నాపత్రంలోనే నిర్దేశించిన బ్రాకెట్లలో రాయండి.

20 × ½ = 10

### భాషాంశాలు(వ్యాకరణం)

1. పోతన భాగవతం రాశాడు. పోతన భోగినీ దండకం రాశాడు. ఈ వాక్యాలను సంయుక్త వాక్యంగా మారిస్తే ( )
   ఎ) పోతన భాగవతం రాసి, భోగినీ దండకం రాశాడు.
   బి) పోతన భాగవతం మరియు భోగినీ దండకం రాశాడు.
   సి) పోతన భాగవతం రాశాడు కాబట్టి భోగినీ దండకం రాశాడు.
   డి) పోతన భాగవతం రాశాడు మరియు భోగినీ దండకం రాశాడు.
2. ఇవ్వనిత–అనే పదాన్ని విడదీస్తే ( )
   ఎ) ఇ + వనిత బి) ఇవ్వ + వనిత
   సి) ఈ + వ్వనిత డి) ఈ + వనిత
3. అనవుడు నల్ల నవ్వి కమలాననను యిట్లను లెస్సగాక యో
   (గీత గీసిన పదం గణం) ( )
   ఎ) జ గణం బి) న గణం సి) ర గణం డి) భ గణం
4. కళింగ రాజ్యం అశోకుడిచే జయించబడింది. ఇది ఏ వాక్యం? ( )
   ఎ) ప్రత్యక్ష బి) పరోక్ష సి) కర్తరి డి) కర్మణి
5. కింది వాటిలో 10వ అక్షరం యతిస్థానంగా ఉన్న పద్యం? ( )
   ఎ) శార్దూలం బి) ఉత్పలమాల
   సి) మత్తేభం డి) చంపకమాల
6. విషయాన్ని ఉన్నది ఉన్నట్లుగా వర్ణిస్తే అది ఏ అలంకారం? ( )
   ఎ) శ్లేష బి) అతిశయోక్తి
   సి) స్వభావోక్తి డి) రూపక
7. అన్యాయం అనేది ఏ సమాసానికి ఉదాహరణ? ( )
   ఎ) ద్వంద్వ బి) నఞ్ తత్పురుష
   సి) షష్టి డి) బహువ్రీహి
8. మా ఊరిలో సముద్రం అంత చెరువు ఉంది. ఇందులో అలంకారం? ( )
   ఎ) అతిశయోక్తి బి) రూపకం
   సి) యమకం డి) ఉపమ
9. కింది వాటిలో గుణ సందికి ఉదాహరణ కాని పదం? ( )
   ఎ) రాజేంద్రుడు బి) మహోద్యమం
   సి) మాతౄణం డి) మహర్షి
10. అకారానికి ఏ, ఐలు పరమైతే ఐకారం వచ్చే సంధి రూపం ( )
    ఎ) సవర్ణ బి) గుణ సి) వృద్ధి డి) త్రిక
11. ఏక + ఏక అనే పదాలు కల్పిరాస్తే ఏర్పడే పదం? ( )
    ఎ) ఏకోక బి) ఏకైక సి) ఏకేక డి) ఏకఏక
12. పద్యాలు – గణాలు ఆధారంగా సరైన జతను గుర్తించండి. ( )
    ఎ) శార్దూలం – మ, స, జ, స, త, త, గ
    బి) చంపకమాల – న, జ, భ, జ, జ, జ, ర
    సి) మత్తేభం – స, భ, ర, న, మ, య, వ
    డి) పైవన్నీ సరైనవే
13. వయోవృద్ధుడు అనే సమాసపదానికి విగ్రహ వాక్యం ( )
    ఎ) వయస్సు వల్ల వృద్ధుడు బి) వయస్సు చేత వృద్ధుడు
    సి) వయస్సు కొరకు వృద్ధుడు
    డి) వయస్సు యొక్క వృద్ధుడు
14. వృత్త్యానుప్రాసాలంకార లక్షణం? ( )
    ఎ) విశేషాన్ని సామాన్యం చేత, సామాన్యాన్ని విశేషం చేత సమర్థించడం
    బి) హల్లుల జంట అర్థ భేదం లేకుండా వెంటవెంటనే రావడం
    సి) ఒకటి లేదా అంత కంటే హల్లులు పలుమార్లు వచ్చునట్లు చెప్పడం
    డి) పదాల, పాదాల, వాక్యాల చివర ప్రాస వచ్చేటట్లు చెప్పడం
15. కింది వాటిలో సంభావన పూర్వపద కర్మధారయ సమాసానికి ఉదాహరణ ఏది? ( )
    ఎ) రాజోత్తముడు బి) వేప చెట్టు
    సి) రామ లక్ష్మణులు డి) అధర్మం
16. తాము షిర్డీ వెళ్తున్నామని రాజు చెప్పాడు.
    ఈ వాక్యాన్ని ప్రత్యక్ష కథనంలోకి మార్చితే ( )
    ఎ) 'తాము షిర్డీ వెళ్తున్నాం' అని రాజు చెప్పాడు
    బి) మేము షిర్డీ వెళ్తున్నామని రాజు చెప్పాడు

www.sakshieducation.com

సి) 'మేము షిర్డీ వెళ్తున్నాం' అని రాజు చెప్పాడు
డి) మేమంతా షిర్డీ వెళ్తున్నాం అని రాజు చెప్పాడు.

17. పద్యపాదం–అక్షరాలు సరికాని జతను గుర్తించండి. ( )
ఎ) ఉత్పలమాల – 10 బి) చంపకమాల – 11
సి) శార్దూలం – 12 డి) మత్తేభం – 14

18. ఉపాధ్యాయుడు జ్ఞానజ్యోతిని వెలిగిస్తాడు. ఇందులోని అలంకారం? ( )
ఎ) ఉపమ బి) రూపక సి) యమక డి) ఉత్ప్రేక్ష

19. దశ సంఖ్యగల దిక్కులు అనే విగ్రహ వాక్యానికి సమాస పదం ( )
ఎ) దశ దిక్కులు బి) దశ యొక్క దిక్కులు
సి) దిక్కుల దశ డి) దిక్కుల యొక్క దశ

20. రాముడు శివధనుస్సు విరిచి సీతను పెండ్లాడాడు. ( )
పై సంశ్లిష్ట వాక్యాన్ని సామాన్య వాక్యాలుగా మారిస్తే?
ఎ) రాముడు శివధనుస్సు విరిచాడు. రాముడు సీతను పెండ్లాడాడు.
బి) రాముడు శివధనుస్సు విరిచాడు కాబట్టి సీతను పెండ్లాడాడు
సి) రాముడు శివధనుస్సు విరుస్తాడు. సీతను పెండ్లాడాడు.
డి) రాముడు శివధనుస్సు విరుస్తాడు. రాముడు సీతను పెండ్లాడాడు.

## సమాధానాలు

అ) 1) విశ్వామిత్ర మహర్షి.
2) తన కుమారుల వివాహ ప్రస్తావన కోసం
3) వశిష్ఠుడి ఉపదేశాలను పొందడం వలన
4) అతిథి మనకు దేవునితో సమానం
5) విశ్వామిత్రుడు పెట్టే కార్యభారం

ఆ) విద్యార్థులు 6 నుంచి 10 ప్రశ్నలకు సమాధానాలు (ప్రశ్నల తయారీ) సొంతంగా చేయాల్సి ఉంటుంది.

ఇ)
11) సిరిలేకైన విభూషితుండె యయి భాసిల్లున్ బుధుండౌ దలన్
గురు పాదానతి కేలనీగి చెవులందున్విన్కి వక్త్రంబునన్
స్థిర సత్యోక్తి భుజంబులన్విజయమున్ చిత్తంబునన్ సన్మనో
హర సౌజన్యము గల్గినన్ సురభిమల్లా! నీతి వాచస్పతీ!

**భావం:** నీతిలో బృహస్పతి అంతటివాడవయిన ఓ సురభిమల్లా! తలవంచి గురువు పాదాలకు నమస్కరించేవాడు, దాన గుణం కలిగినవాడు, చెప్పే విషయాన్ని శ్రద్ధగా వినేవాడు, సత్యవ్రతుడైన వాడు, భుజబలంతో విజయాలను పొందేవాడు, మనస్సు నిండా మంచితనం కలవాడయిన పండితుడు సంపదలు లేకున్నా ప్రకాశిస్తాడు.

**(లేదా)**

అనవుడు నల్ల నవ్వి కమలానను యిట్లను లెస్సగాక, యో
మునివర! నీవు శిష్యగణముంగొని చయ్యన రమ్ము విశ్వనా
థుని కృపపేర్మి నెందఱతిథుల్ చనుదెంచినC గామధేనువుం
బనిగొనునట్లు పెట్టుదు నపారములైన యభీప్సితాన్నముల్

**భావం:** అని వేదవ్యాసుడు పలుకగా కొంచెం నవ్వి పద్మముఖియైన ఆ ఇల్లాలు 'సరేలే! మునీంద్రా! విశ్వనాథుని దయవల్ల ఎంతమంది అతిథులు వచ్చినా కామధేనువులే కోరిన పదార్థాలన్ని అనంతంగా నేను ఏర్పాటు చేయగలను. నీ శిష్య గణాన్ని తీసుకొని వెంటనే రా' అన్నది.

ఈ)
12) సూర్యుడు (కమలాలకు మిత్రుడు)
13) తమ తమ హద్దులు(నెలవులు) దాటినప్పుడు
14) నెలవులు
15) సుమతీ
16) వదిలిన
17) ఓ మహాదాతా, మహితాత్మ బలిచక్రవర్తి....

నీవు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి, నీ గురువు గారు హెచ్చరిస్తున్నా వచ్చినవాడు వామనుడు కాదు, మహావిష్ణువు అని తెలిసినా నీవు చేసిన దానం అపూర్వం, అద్భుతం, సదా అభినందనీయం. మాటకు కట్టుబడటమే మానధనుల లక్షణం అన్న నీ అభిప్రాయం అందరికీ ఆచరణీయం. ఎన్నో యజ్ఞాలు, యాగాలు చేసినా ప్రత్యక్షం కానీ మహావిష్ణువు నీ ముందు యాచకునిగా నిలబడ్డాడంటే నీ దానగుణం ఎంత గొప్పదో అర్థమవుతుంది. నరకం వచ్చినా, దుర్మరణం వచ్చినా, నీవంశం అంతరించిన సరే ఆడినమాట తప్పననే నీ హృదయ సంస్కారం ఎంతో ఉదాత్తమైనది.నీలాంటి అభిమాన ధనులు ఎన్ని కాలాలైన, ఎన్ని యుగాలైనా అంద రి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. నీ దాన హృదయానికి హృదయాంజలి ఘటిస్తూ..

ఇట్లు
అభిమాని,
-----.

18. **లేఖ**

సూర్యాపేట,
తేది: 18–03–2020.

ప్రియమైన మిత్రునికి,
ఉభయకుశలోపరి.
ఇటీవల మాకు శతక మధురిమ అనే పాఠ్యాంశాన్ని బోధించినారు. ఈ పాఠం ద్వారా కేవలం విద్యార్థులకే కాకుండా సమస్త మానవులందరికీ పనికి వచ్చే చక్కని నీతులు ఉన్నాయి. సాంఘిక, ఆధ్యాత్మిక, భక్తితో కూడిన ఎన్నో జీవన విలువలు ఉన్నాయి. అందుకే నేను ఇప్పటినుంచి శతక సాహిత్యం సేకరించి భద్రపరుద్దామనుకుంటున్నాను. నీవు కూడా శతక సాహిత్యం పట్ల అవగాహన పెంచుకుంటావని ఆశిస్తూ...
మీ అమ్మనాన్నలకు నమస్కారాలు.

ఇట్లు
నీ ప్రియమిత్రుడు,
----------.

చిరునామా
పొగాకుల సతీష్,
ఇంటి నెం. 1–98,
చిన్న సూరారం,
నల్లగొండ జిల్లా.

19. నేను వ్యాసమహర్షిని. పవిత్రమైన కాశీ నగరంలో ఉంటూ భిక్షాటనం చేస్తూ నేను నా శిష్యగణం జీవనం గడిపే వాళ్లం. ఒకసారి ఎందువల్లో కాశీనగరంలోని స్త్రీలు నాకు భిక్ష సమర్పించలేదు. ఎంతో విజ్ఞానినైన నేను దాంతో విచక్షణను కోల్పోయి మిక్కిలి కోపంతో భిక్ష పాత్ర నేలకేసి కొట్టి, కాశీ నగరంలోని ప్రజలకు మూడు తరాలదాకా ధనం, విద్య, మోక్షం లేకుండుగాక అని శపించబోయాను. అప్పుడు పార్వతీదేవి ఒక సామాన్య స్త్రీ వేషంలో వచ్చి నన్ను మందలించి, నేను చేసిన తప్పును ఎత్తి చూపిస్తుంది. అప్పుడుగాని నేను ఎంత మూర్ఖంగా ప్రవర్తించానో తెలియలేదు. నాలోని ఆకలి నా విచక్షణను నశింపచేసింది. నన్ను ఎన్నో సంవత్సరాలుగా ఎంతో గౌరవిస్తున్న ఈ కాశీనగర వాసులను ఎలా శపించాలనుకున్నానో నాకే అర్థం కావడం లేదు. అంతేగాకుండా శివుడికి ఎంతో ప్రీతిపాత్రమైన కాశీని శపించాలనుకొని నేను ఎంతో మూర్ఖంగా ప్రవర్తించాను. ఉన్న ఊరు కన్నతల్లి లాంటిదన్న నీతిని ఎలా మర్చిపోతినో కదా. నేను చేసిన పాపాన్ని ఎలా సరిదిద్దు కోవాలో అర్థం కావడం లేదు. నాలాగే ఎవరూ కూడా విచక్షణ కోల్పోరాదని, కోపాన్ని అదుపులో పెట్టుకోవాలని ప్రార్థిస్తున్నాను. అప్పుడు ఆ పరమశివుడి చల్లని చూపు మనందరిపైన ఉంటుంది. నాలాంటి తప్పు మీరెవరూ చేయరని ఆశిస్తున్నాను.

### పార్ట్ -బి సమాధానాలు

| | | | | |
|---|---|---|---|---|
| 1) డి | 2) డి | 3) ఎ | 4) డి | 5) బి |
| 6) సి | 7) బి | 8) ఎ | 9) సి | 10) సి |
| 11) బి | 12) డి | 13) బి | 14) సి | 15) బి |
| 16) సి | 17) సి | 18) బి | 19) ఎ | 20) సి |

www.sakshieducation.com